## క్లుప్తంగా

### చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


ఎస్.నవ్య

టెక్కలి రూరల్: ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో కోటబొమ్మాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని నందిగాం నవ్య ద్వితీయ బహుమతి సాధించారు. బారువా బీచ్‌లో శనివారం జరగనున్న ఆలివ్ రిడ్ తాబేళ్ల పండుగ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్, విద్యాశాఖాధికారులు చేతుల మీదుగా బహుమతి అందుకోనున్నట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నవ్యను ఎంఈఓలు సీహెచ్ గోవింద, ఎల్‌వీ ప్రతాప్, హెచ్‌ఎం డి.గోవిందరావు అభినందించారు.

### సారారహిత గ్రామాలే లక్ష్యం


ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

సోంపేట: సారా రహిత గ్రామాలే లక్ష్యంగా సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నవోదయం 2.0 ప్రగతి సాధించాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోంపేట కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నవోదయం 2.0 కార్యక్రమానికి సంబంధించి గ్రామ దత్తత అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. సోంపేట సీఐ కె.బేబి తదితరులు పాల్గొన్నారు.

### పదోన్నతులు కల్పించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

కవిటి/కంచిలి: సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలని కోరుతూ ఉత్తరాంధ్ర వెల్ఫేర్ ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను తన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మిగతా ఉద్యోగుల మాదిరిగా తమకు కూడా సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్‌తో ప్రమోషన్ కల్పించాలని, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఉద్యోగులు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

### తెప్పలకు కళాభారతి పురస్కారం


సత్కారం పొందుతున్న తెప్పల కృష్ణమూర్తి

కాశీబుగ్గ: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాభారతి ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవంలో భాగంగా పలాసకు చెందిన జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. కళాభారతి 20వ వార్షిక రాష్ట్ర ఆహ్వాన నాటిక పోటీల్లో కృష్ణమూర్తి పాల్గొని నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా సాహిత్య రంగానికి చేస్తున్న సేవలను గుర్తించి కళాభారతి పురస్కారం అందించారు. కృష్ణమూర్తిని సాహితీవేత్తలు, కళాకారులు శుక్రవారం అభినందించారు.

### నువ్వలరేవులో శాంతి హోమం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు రూరల్: జిల్లాలో అతిపెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవులో శుక్రవారం భక్తిశ్రద్ధలతో శాంతి హోమం నిర్వహించారు. గ్రామ ఐక్యత, అభివృద్ధి, సుభిక్షం కోసం 23 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఈ కార్యక్రమంతో గ్రామం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వేద పండితులు మంత్రోచ్ఛారణ నడుమ శాంతిహోమం నిర్వహించారు. బృందావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శివునికి అభిషేకాలు చేసి కరుణ కటాక్షాలు ప్రసాదించాలని కోరుకున్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మువ్వల పూర్ణచంద్రరావు, ఉప సర్పంచ్ లోకనాథం, సొసైటీ అధ్యక్షుడు నీలాంబర్, ఎంపీటీసీలు భీమారావు, వెంకటరావు, ఆనంద్, కె.వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహన్‌రావు పాల్గొన్నారు.

### ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

కొత్తూరు: ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ మండలంలోని సిరుసువాడలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు శుక్రువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో నైతిక విలువలతో కూడిన విద్య అందివ్వడం జరుగుతుందన్నారు. సర్పంచ్ పోలినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు దివ్య, పాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.

# ఉపాధి లెక్కలు తేలేనా?

- రూ.3 కోట్ల నిధులపై పునర్విచారణకు ఆదేశించిన డ్వామా పీడీ
- సిబ్బంది గుండెల్లో గుబులు

సంతబొమ్మాళి :

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది గుండెల్లో గుబులు రేగుతోంది. మూడు కోట్ల రూపాయల విలువైన ఉపాధి పనులపై డ్వామా పీడీ సుధాకర్ పునర్విచారణ(రీ ఎంక్వైరీ)కి ఆదేశించడంతో లెక్కలు తేల్చేపనిలో ఆ శాఖ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళి మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 34 పంచాయతీల్లో రూ.26,22,19,983 విలువైన ఉపాధి పనులు జరిగాయి. ఈ నిధులపై గత నెల 15 నుంచి 28వ తేదీ వరకు సోషల్ బృందాలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల రిపోర్టును గత నెల 29వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వామా పీడీ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన సోషల్ ఆడిట్ బృందాలు బహిర్గతం చేశాయి. మండలంలో నాలుగు కోట్ల 33 లక్షలు అవినీతి జరిగినట్లు గుర్తించాయి. సంతబొమ్మాళి, మేఘవరం పంచాయతీలకు సంబంధించి 57 లక్షల రూపాయల మస్టర్లు మాయమయ్యాయని గుర్తించడంతో పీడీ సుధాకర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అయినా ఇంత వరకు పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. అలాగే ఉపాధి సిబ్బంది నుంచి రూ.10 లక్షల 96వేలు రికవరీ ఆదేశించగా, లక్షా ఏడువేలు రూపాయలు జరిమానాగా విధించారు. ముఖ్యంగా కొలతల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉండటంతో దుర్వినియోగమైన మూడు కోట్లు ఉపాధి నిధులపై ఏపీడీ ఆధ్వర్యంలో రీ ఎంక్వైరీకి పీడీ ఆదేశించారు. దీంతో ఉపాధి సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. లక్షల రూపాయలు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. మొత్తం చెరువు విస్తీర్ణం కంటే పని చేసిన విస్తీర్ణం ఎక్కువగా టెక్నికల్ అసిస్టెంట్లు నమోదు చేయడం దీనికి కారణంగా తెలుస్తోంది. నమోదు చేసిన కొలతల ప్రకారం స్థలమే లేకపోతే మెజర్మెంట్ ఏ విధంగా చేసి బిల్లులు చెల్లించారో లెక్కలు తేల్చే పనిలో ఉన్నతాధికారులు ఉన్నారు.


ఉపాధి పనులు నిర్వహిస్తున్న దృశ్యం


ప్రజావేదికలో రీ ఎంక్వైరీకి ఆదేశిస్తున్న డ్వామా పీడీ సుధాకర్(ఫైల్)

**ఆదేశాలు రావాల్సి ఉంది..**

ఉపాధి పనులపై జరిగిన సోషల్ ఆడిట్‌లో బహిర్గతమైన అవినీతిపై కొన్ని పనులకు ఏపీడీ ఎంక్వైరీకి డుమా పీడీ ప్రజా వేదికలో ఆదేశించారు. డ్వామా కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత విచారణ జరుపుతాం.

– పి.శైలజ, డ్వామా ఏపీడీ, టెక్కలి

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం


కాశీబుగ్గ: ఫోమింగ్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


టెక్కలిలో ప్రైవేట్ ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


కోటబొమ్మాళిలో పెట్రోల్ బంకు వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


సోంపేట: అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం పెట్రోల్ బంక్ వద్ద అవగాహన కల్పిస్తున్న అధికారులు

టెక్కలి: అగ్ని ప్రమాద నియంత్రణ పరికరాల వినియోగంపై టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లో అగ్ని మాపక శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా పెట్రోల్ బంకులు, ప్రైవేట్ ఆసుపత్రులలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి అగ్ని ప్రమాద నియంత్రణ చర్యలను వివరించారు.

ఇచ్ఛాపురం రూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తే ముప్పు తప్పించుకోవచ్చని అగ్నిమాపకాధికారులు కె.ప్రశాంత్‌కుమార్, ఆర్.సూర్యారావు అన్నారు. ఈదుపురం పెట్రోల్ బంక్ వద్ద వాహన చోదకులకు, విద్యార్థులకు 'ఫైర్ ఎక్సింగ్ విషర్స్'ను వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు.

సోంపేట: గ్యాస్ ప్రమాదాలు జరిగేటప్పుడు అవగాహన అవసరమని అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు అన్నారు. సోంపేట సాయిగ్యాస్ ఏజెన్సీ గోదాం వద్ద గ్యాస్ ప్రమాదాలపై అవగాహన శుక్రవారం నిర్వహించారు.

కాశీబుగ్గ: పలాస మండలం రామకృష్ణాపురం పవర్ గ్రిడ్ కేంద్రం వద్ద శుక్రవారం పలాస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## యువతి అదృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం లత్తూరు గ్రామానికి చెందిన యువతి కనిపించడం లేదని సోదరుడు శుక్రవారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంధువులతో కలిసి మేడపై పడుకున్న తన సోదరి ఉదయానికి కనిపించలేదని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం

టెక్కలి: వచ్చే నెల 10, 11 తేదీలలో ఏలూరులో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు టెక్కలి ప్రజా చైతన్య కళా సమితి సభ్యులను ఆహ్వానించారు. శ్రీశ్రీ కళా వేదిక పట్టాభిషేకాల్లో పాల్గొని ప్రతిభ పురష్కారాలు స్వీకరించాలని ఆహ్వానం అందిందని కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డి.ఏ.స్టాలిన్, రచయిత రేజేటి వెంకటరమణమూర్తి, యువ రచయిత దూసి భరత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళా సమితి ప్రతినిధులు చిలుకు కృష్ణారావు, యు.గణపతిరావు, బి.కృష్ణారావు, ఎం.తాతయ్య, ఎ.చిట్టిన్న తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## అధికారులను విచారించాలి

టెక్కలి : టెక్కలి జగతిమెట్ట జగనన్న కాలనీలో అక్రమ పట్టాల దర్యాప్తు విషయంలో అధికారులను విచారించి అర్హులైన వారికి ఇంటి స్థలాలు అందజేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అక్రమంగా పట్టాలు ఇచ్చారంటూ ఆయా కాలనీలో హడావుడి చేస్తున్నారని, అలాగైతే అప్పట్లో పనిచేసిన రెవెన్యూ సిబ్బందిపైనా విచారణ చేయాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొంత మంది టీడీపీ కార్యకర్తలు చేతివాటం ప్రదర్శించి స్థలాలను అక్రమంగా కాజేశారని దుయ్యబట్టారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని సత్యం కోరారు.

# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ఇచ్ఛాపురం: పట్టణంలోని పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ జాన్సన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో క్రిస్టియన్ పెద్దలు ప్రత్తి విజయ్‌కుమార్, వజ్రపు వెంకటేష్, తాతాజీ, సీహెచ్ లక్ష్మీనారాయణ, గోపాల్, కె.శివరావు, జోష్‌కుమార్, దిలీప్, కిరణ్, సుధీర్, అమిత్, ప్రదీప్ పాల్గొన్నారు.

టెక్కలి: గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పట్టణంలో పలు క్రైస్తవ మందిరాల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను తెలియజేసేలా భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

సోంపేట: పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్టు చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రీస్తు శిలువ విజయోత్సవ యాత్ర నిర్వహించారు. సంఘ కాపరి అబ్రహామ్ ఏసు క్రీస్తు బోధనలు వినిపించారు. కార్యక్రమంలో సంఘ కాపరులు వరదాన్, లీలాహోదస్సా, మైనార్టీ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్‌బాబు, సీఐ బి.మంగరాజు, ఎస్‌ఐ లవరాజు తదితరులు పాల్గొన్నారు. బారువ, కొర్లాం చర్చిల్లోనూ గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం, మండపల్లి, డొంకూరు గ్రామాల చర్చిల్లో క్రైస్తవ సోదరులు ఘనంగా గుడ్ ఫ్రైడే నిర్వహించారు. పాస్టర్లు బిమ్మో బెహరా, పి.ప్రకాశరావులు దేవుని వాక్యాలు చదివి వినిపించారు. అనంతరం క్రైస్తవులు శిలువను పుర వీధుల్లో ఊరేగించారు.

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని చినబడం గ్రామంలో క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన వేడుకలు నిర్వహించారు.


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో బిమ్మో బెహరా ఆధ్వర్యంలో శిలువ యాత్ర


కాశీబుగ్గ: భక్తిగీతాలు ఆలపిస్తున్న దృశ్యం


కాశీబుగ్గ: ప్రార్థనలు నిర్వహిస్తున్న బిషప్ కుమార్




సోంపేట: ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు, (ఇన్‌సెట్లో) శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు


ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రకాశరావు


ఇచ్ఛాపురం: క్రీస్తు సందేశం వివరిస్తున్న పాస్టర్ జాన్సన్


టెక్కలి: ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

# ఆధ్యాత్మికతతో ప్రశాంతత

ఇచ్ఛాపురం రూరల్: తులసిగాం గ్రామదేవత వైదేహీమాత కొత్తమ్మతల్లి ఆలయం ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మాజీ జెడ్పీటీసీ దక్కత నూకయ్యరెడ్డి, మాజీ ఎంపీపీ నర్తు చామంతి, ఉప్పాడ రాజారెడ్డి, పిట్ట మామయ్య, పిట్ట బాలయ్య, ఆశి పురుషోత్తం, రాంపత్ని చిట్టిబాబు, పిట్ట విశ్వనాథం, ఇసురు యాదవరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకున్న నర్తు రామారావు దంపతులు

**ఉత్సవాలకు శుభరాట**


కొర్లాం పంచాయతీ హుకుంపేటలో మే 19 నుంచి 27 వరకు జరగనున్న నీలమ్మ తల్లి ఉత్సవాలకు సంబంధించి గ్రామస్తులు శుక్రవారం శుభరాట వేశారు. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. – సోంపేట

**జై చిరంజీవ..జగదేకవీర..**


గోవిందపుట్టుగలో శుక్రవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఒడిశాకు చెందిన పురోహితుల బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. – కవిటి

**కాలువ కాదు.. రోడ్డే!**


పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో లేబరుకాలనీలో రోడ్డు కాలువను తలపిస్తోంది. ఇరువైపులా ఉన్న కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికలతో నిండిపోవడంతో కొద్దిపాటి వర్షమొచ్చినా నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. – కాశీబుగ్గ

# వేతనాలు వెంటనే చెల్లించాలి


పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, యూనియన్ నాయకులు

రణస్థలం: మండలంలోని వరిశాం వద్ద గల శ్యాం పిస్టన్స్ ప్లాంట్–2 పరిశ్రమ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ.. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు మార్చి నెల వేతనాలను వెంటనే చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో చెల్లించాల్సిన బోనస్ ఇంతవరకు చెల్లించలేదన్నారు. 30 ఏళ్ల సర్వీసు పూర్తయిందని 110 మంది కార్మికులతో బలవంతంగా రిటైర్మెంట్ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. చార్టర్ ఆఫ్ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పల నర్సయ్య, గొర్లె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మనోధైర్యంతో ముందుకు సాగాలి


సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఓ రజిని

కంచిలి: బాలికలు మనోధైర్యంతో ముందుకుసాగాలని కేజీబీవీ ఎస్ఓ రజిని అన్నారు. జాడుపూడి కేజీబీవీలో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు 'పరీక్షలు, మార్కులే జీవితమా' అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ బత్తిని ఈశ్వరరావు మాట్లాడుతూ పరీక్షల్లో తప్పినంత మాత్రాన జీవితం కోల్పోయినట్లు కాదన్నారు. ఉత్తీర్ణత బాగా లేకపోయినా ఎందరో వ్యక్తులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తు చేశారు. జీవిత ప్రయాణంలో పరీక్షలు ఒక మెట్టు మాత్రమేనని, మన మార్కులు మన ప్రతిభను పూర్తిగా ప్రతిబింబించవని పేర్కొన్నారు. ఒక్కసారి తక్కువ వచ్చిన ఫలితాలు, జీవితాంతం మన విజయాలను నిర్దేశించలేవన్నారు. పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.